ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

మంగళవారం 7 మే 2024



కోరుట్లలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

కేసీఆర్‌కు ఘన స్వాగతం

కాన్వాయ్‌కి పూజలు చేసి నియోజకవర్గంలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్, మే 6: నిజామాబాదు జిల్లా కేంద్రంలో జరిగే ఎన్నికల ప్రచారానికి వెళుతున్న మాజీ సీఎం కేసీఆర్‌కు కోరుట్లలో ఘనస్వాగతం లభించింది. సోమవారం మండలంలోని మోహన్‌రావుపేట గ్రామానికి చేరుకోగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు గుమ్మడి కాయ కొట్టి ప్రత్యేక పూజలను నిర్వహించి కాన్వాయికి స్వాగతం పలికారు. గ్రామ శివారులో కేసీఆర్ కాన్వాయ్ చేరకోగా బీఆర్‌ఎస్ శ్రేణులు పూలు చల్లి స్వాగతం పలికారు. టపాసులు పేల్చారు. బస్సులో నుంచి కేసీఆర్ బీఆర్‌ఎస్ శ్రేణులతో పాటు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వెంకటాపూర్, గుమ్లాపూర్ గ్రామాల మీదిగా కాన్వాయ్ కోరుట్ల వైపు సాగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య - రాజేష్, ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావులతో పాటు మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: జగిత్యాల నుంచి నిజామాబాదు వెళుతున్న కేసీఆర్‌కు పట్టణ బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్న కేసీఆర్ కాన్వాయ్‌కి మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య - అనిల్, వార్డు సభ్యులు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. కేసీఆర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. పట్టణంలోని జాతీయ రహదారిపై బస్సు నుంచి కేసీఆర్ అభివాదం చేస్తూ ముందుకు సాగగా అభిమానులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పుష్పవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు.

కేసీఆర్ అభివాదంతో కార్యకర్తల్లో జోష్

మెట్‌పల్లి : బీఆర్‌ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ప్రగతి బస్సు యాత్రకు పట్టణంలో నాయకులు, ప్రజలు స్వాగతంలో ఆయన అభివాదంతో జోష్ నింపారు. సోమవారం జిల్లా కేంద్రంలో బస్సుయాత్రను ముగించుకొని నిజామాబాద్ జిల్లాలో పర్యటించడానికి మెట్‌పల్లి పట్టణం మీదుగా బయలు దేరారు. మధ్యాహ్నం పట్టణంలోని బస్సు డిపో, పాత బస్టాండ్, కొత్తబస్టాండ్ మీదుగా బస్సు యాత్ర కొనసాగింది. ఈ సందర్భగా ఆయనకు నాయకులు, శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని మళ్లీ అధికారంలోకి వస్తామని, ఎవరు నిరుత్సహపడకుండా ఉత్తేజంతో పని చేయాలని ధీమా వ్యక్తం చేస్తూ అభివాదం చేసుకుంటూ యాత్ర బయలు దేరింది. బస్సు యాత్ర మెట్‌పల్లి మండలంలోని మారుతీనగర్ నుంచి జిల్లా సరిహద్దు గండి హనుమాన్ దేవాలయం వరకు సందడి కొనసాగింది.



మెట్‌పల్లిలో కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు, ప్రజలు

'కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి'

గొల్లపల్లి, మే 6 : పెద్దపల్లి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటి చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ గోస్కుల జలేందర్, బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు బలభక్తుల కిషన్ ఉపాధి హామీ కూలీలను ఓటు అభ్యర్థించారు. సోమవారం గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు బలభక్తుల కిషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్మలా మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదల అభివృద్ధి

గొల్లపల్లి, మే 6 : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ముస్కు నిశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో, శ్రీరాముల పల్లెలో ఎంపీటీసీ లంభ ధనవ్వలక్ష్మన్ ఆధ్వర్యంలో, ఇబ్రాజ్ పల్లె, శంకర్రావుపేట, రాపల్లె, గోవిందు పల్లె, చిల్వాకోడూర్, బొంకూర్ గ్రామాల్లో స్థానిక కాం గ్రెస్ తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తాజామాజీ సర్పంచ్‌లు చిర్ర గంగాధర్, సరసాని రాజ్యలక్ష్మీతిరుపతి రెడ్డి, కాండా వెంకటేష్‌గౌడ్, ఆవు నూరి శ్రీధర్, నాయకులు ముల్కాల శ్రీనివాస్, సాన కోమురయ్య, మజ్జు బాయ్, మ్యాక స్వామి, పురపాటి రాజిరెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మెట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి, మే, 6 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలన మేడిపండు రూపంగా ఉందన్నారు. పసుపు బోర్డుపై బీజేపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేకున్నా ఎంపీ ధర్మపురి అర్వింద్ మాజీ ఎంపీ కవితను ఆదర్శంగా తీసుకుని ఆమె అడుగు జాడల్లో నడుస్తుడన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సంవత్సర కాలం పాటు దీక్షా చేపట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని చక్కెర ఫ్యాక్టరీలను వన్ టైమ్ సెటిల్‌మెంట్ కోసం బకాయిలు చెల్లించేందుకు రూ. 43కోట్ల ని ధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రం వ్యాపారాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలపై ఆలోచిస్తుందన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం రైతులను దృష్టిలో పెట్టుకుని ఫ్యాక్టరీలను పునరుద్ధరణ దిశగా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో అక్రమంగా సొమ్మును వసూలు చేస్తూ ఢీల్లికి తరలిస్తే ఆర్ఆర్ టాక్స్ అంటూ అమిత్‌షా మాట్లాడడం విడ్డూరంగా ఉందని, అక్రమ సొమ్ము తరలిస్తే కేంద్రంలోని ఉన్న బీజేపీ ప్రభుత్వం కళ్లు మూసు కుందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఆగడాల ను తరిమికొట్టడానికి లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమిరెడ్డి కరం చంద్, కొమిరెడ్డి విజయ్‌అజాద్, కల్వకుంట్ల సుజిత్‌రావు, నర్సింగరావు, లింగం, షాకీర్, యామ రాజయ్య, హన్మండ్లు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మల్లాపూర్: నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గెలిపించడానికి చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సుజిత్‌రావు కోరారు. సోమవారం మండలంలోని మొగిలిపేట గ్రామ శివారులో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు ఎనడ్ల బుచ్చిరెడ్డి, జల పతిరెడ్డి, రమేష్, చిన్నయ్య పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఆస్పత్రి సిబ్బంది నిరసన



రాయికల్ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

రాయికల్, మే 6: కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రితో పాటు మండలంలోని ఒడ్డెలింగాపూర్ ఆస్పత్రి వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి నాన్ బెయిలబుల్ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కస్తూరి సతీష్, శశికాంత్ రెడ్డి, రవి, రజిత, సీహెచ్‌వో ప్రమీల, దేవిక, హెచ్‌ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి : కోరుట్ల సీహెచ్‌సీలో ఆసుపత్రి సిబ్బందిపై దాడి చేసి డీజిల్ పోసి కాల్చి చంపేందుకు ప్రయత్నించిన అమానుష చర్యను నిరసిస్తూ పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్యాధికారులు నరేష్, రమ, సిబ్బంది రవికిరణ్, జయశీల. తార పాల్గొన్నారు.

మల్యాల: కోరుట్ల పీహెచ్‌సీలో అక్కడి వైద్య సిబ్బందిపై దాడి చేసి డీజిల్‌తో నిప్పంటించాలని యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మల్యాల ప్రాథమిక ఆసుపత్రిలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యురాలు మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల : కోరుట్ల పీహెచ్‌సీలో ఆసుపత్రి సిబ్బందిపై దాడి చేసి డీజిల్ పోసి కాల్చి చంపేందుకు ప్రయత్నించిన అమానుష చర్యను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనను తామంత ఖండిస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. నిదితులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన వ్యక్తం చేసిన వారిలో వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, స్టాఫ్ నర్స్, మీడిల్ లేవల్ హెల్త్ ప్రోవైడర్లు, హెచ్‌వీలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



చాయి ఫే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, మే 6 : నిజామాబాదు ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను బలపరిచి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. సోమవారం మండంలోని మోహన్‌రావుపేట గ్రామంలో చాయిపే కార్యక్రమం ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కోరుట్ల పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, రైతు సమన్వయ కమిటి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావులతో కలిసి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను నమ్మి మళ్లీ మోసపోవదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూర్యుడు

- గుల్లకోటలో 46.8 డిగ్రీలు
- రోజు రోజుకూ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

జగిత్యాల టౌన్/వెల్గటూర్ మే 6: సూర్య భగవానుడు సుర్రుమంటున్నాడు. దీంతో రహదారులు నిప్పుల కొలిమిలా మారాయి. ఉదయం 10 గంటల నుండే ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ప్రజలు బయటకి వచ్చేందుకు జంకు తున్నారు. రెండు, మూడు రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాం తం పెరిగిపోతున్నాయి. వెల్గటూర్ మండలం గుల్లకోటలో సోమవారం అత్యధికంగా 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో పాటు రాయికల్ అల్లీపూర్‌లో 46.8, జిల్లా బీర్‌పూర్ కొల్వాయి లో 46.3, ఇబ్రహీంపట్నం గోధూర్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో వాతవరణ శాఖ అప్రమత్తమైంది. రెడ్ అలర్ట్‌గా ప్రకటించింది. అత్యవసర పరిస్థితుల్లో జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా జగిత్యాల జిల్లాలోనే మూడు ప్రాంతాలు ఉండడంతో ఎండ వేడిమి ఎలా ఉందో తెలి సిపోతుందని చెప్పవచ్చు. ఈ ప్రభావంతో రాత్రి 10 దాటిన తర్వాత కూడా ఉక్కపోతలు తప్పకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఎండ వేడిమికి జనం రోడ్లపై కన బడకపోవడంతో బోసిపోయాయి. వెల్గటూర్ ప్రాంతానికి గోదావరి తీరం దగ్గరగా ఉండడంతో పాటు ఇసుక మేటలు అధికంగా ఉండడంతోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తమ అభిప్రాయా న్ని వ్యక్తం చేస్తున్నారు.



జగిత్యాలలో ఎండ ప్రభావంతో నిర్మానుషంగా మారిన రహదారులు

కుల, మతాల పేరుతో బీజేపీ చిచ్చుపెట్టేలా చూస్తోంది

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

జగిత్యాల టౌన్, మే 6: కుల, మతాల పేరుతో బీజేపీ చిచ్చుపెట్టేలా చూస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో సోమవారం రాత్రి రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేలా చర్యలు చేపడుతూ ముందుకు సాగుతుందన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చుతామని అంటున్న బీజేపీకి ఈ ఎన్ని కల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జీవన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపిం చాలన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆది శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ మోసపూరిత మాటలు నమ్మవద్దు

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 6: బీఆర్‌ఎస్, బీజేపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట, నేరెళ్ల గ్రామాల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో కలిసి సోమవారం ఉపాధి హామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఉపాధి హామీ కూలీలను కలిసి వారితో మాట్లాడి సమస్యలు గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీలకు 200 నుంచి 400 వరకు వేతనం పెంచుతామన్నారు. బీజేపీ మతం పేరట, దేవుడి పేరట ఓట్లు అడగటం కాదని, ప్రజలకు చేసిన పని ఏమిటో చెప్పుకుని ఓట్లు అడగాలన్నారు. కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వ విప్‌గా, మంత్రిగా పని చేసి ఎంత మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మాట్లాడుతూ ఒక పారిశ్రామిక వేత్తగా ఉన్న తన తనయుడు వంశీకృష్ణ నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయా ల్లోకి వచ్చినట్లు తెలిపారు. వంశీకృష్ణకు ఎంపీగా ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, దమ్మన్నపేట ఎంపీటీసీ తోడేటి గంగాధర్‌గౌడ్, నేరెళ్ల ఎంపీటీసీ రెడ్డవేని సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి జాజాల రమేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహ రాజు ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్









ఉపాధి కూలీల చుట్టూ నేతల ప్రదక్షిణలు




మల్యాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, తాటిపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల, మే 6: పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో పార్టీల నేతలు గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఎండలు దంచి కొడుతుండడంతో ఉదయం పూటే ఉపాధి హామీ పనులకు వెలుతున్న మహిళల వద్దకే నాయకులు పరుగెడుతున్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వారం రోజులుగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పోటీలు పడి ఉపాధి పనుల వద్ద ప్రచారం చేపట్టారు. ఎండ వేడి నివారణకు మజ్జిగ పాకెట్లు అందిస్తూ పనిలో పనిగా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అన్ని గ్రామాల్లో రోజుకో పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద ప్రచారం పూర్తి చేయగా సాయంకాలం వేళలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

● సభలకు వెళితే రూ. 200

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తమ సభలకు వచ్చే మహిళలకు 200 రూపాయల చొప్పున అందిస్తున్నారు. ఉదయం ఉపాధి పనులకు వెలుతున్న మహిళలు సాయంత్రం ఎన్నికల సభలు, సమావేశాలకు వెళుతున్నారు. దీంతో వారికి కొంత ఉపాధి లభిస్తోంది.

మాజీ సీఎం కేసీఆర్ బస్సు తనిఖీ



కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలరూరల్, మే 6: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వాహనాన్ని పోలీసులు సోమవారం రాత్రి తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల నుంచి నిజామాబాద్ రోడ్ షోకి వెళ్తున్న క్రమంలో జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సును పోలీసులు తనిఖీ చేశారు. పోలీసు అధికారులకు కేసీఆర్ సహకరించారు.

గడి స్థలంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

● కలెక్టరేట్‌కు తరలి వచ్చిన చల్‌గల్ గ్రామస్థులు



వినతిపత్రాన్ని చూపుతున్న చల్‌గల్ గ్రామస్థులు

జగిత్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్‌గల్ గడి స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ గామస్థులు జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. గడి ముందు గల ఖాళీ స్థలంలో ఇటీవల ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం ప్రారంభించాడన్నారు. గ్రామానికి చెందిన ఉమ్మడి ఆస్తి అయిన గడి ముందు గల స్థలాన్ని ఆక్రమించడం సరైంది కాదని తెలిపారు. గడి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలోని అన్ని రకాల నిర్మాణాలు, కట్టడాలు తొలగించాలని కోరుతూ పలువురు గ్రామస్థుల సంతకాలతో కూడిన వినతిప్రతం సమర్పించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్ సభ్యులు

కోరుట్ల మే 6: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకున్న సంఘటనపై సోమవారం వైద్యులు, సిబ్బంది కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఆసుపత్రి అవరణలో నిరసన తెలిపారు. వైద్యులు సిబ్బంది చేస్తున్న నిరసనకు మద్దతుగా తెలంగాణ గవర్నమెంట్ గెజిటెడ్ డాక్టర్ అసోసియేషన్, ఐఎం అసోసియేషన్ సభ్యులు మద్దతు పలికారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం డాక్టర్, సిబ్బందిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడికి నిరసనగా వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు డ్యూటీలో ఉన్న వైద్యులు సిబ్బందిపై దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపీ సేవలను రద్దు చేసి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి శ్రీధర్, డీసీహెచ్ఎస్ జిల్లా అధికారిణి సురక్షతన సందర్శించారు. జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయం ఉన్నత అధికారులకు నివేదించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రామయ్యపల్లెలో చోరీ

ధర్మపురి,మే6: మండలంలోని రామయ్యపల్లె గ్రామంలో ఊరడి జయకర్ అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగినట్లు ఆలస్యంగా తెలిసింది. రెండు రోజుల క్రితం జయకర్ రాత్రి వేళలో తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆరు బయట నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తలుపులు తెరచి 10 వేలు నగదు, 45 తులాల వెండి ఆభరణాలు, ఐదు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, మే6: మండలంలోని బొమ్మకల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 102 మంది వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి సభ్యులు కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎం ఎల్ఎన్‌రెడ్డి, ఊట్కూరు రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొడిమ్యాలలో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, మే 6: మండల కేంద్రానికి చెందిన దండుగుల శేఖర్‌కు చెందిన గుడిసె సోమవారం ఉదయం దగ్ధమైంది. గుడిసెలోని నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బట్టలు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కొడిమ్యాలలో దగ్ధమైన గుడిసెను పరిశీలించారు. శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల రూపాయలు అందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

రాజాపూర్‌లో పొలం దగ్ధం

రామగిరి, మే 6: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఎలువాక సంపత్‌కుమార్‌కు చెందిన అర ఎకరం పొలం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బురదగా ఉండడంతో కోపించిన వరిని కల్లంలో కుప్పగా పేర్చి ఉంచారు. సోమవారం అగ్ని ప్రమాదంలో వరికుప్ప దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమా రు 20 బస్తాల వడ్లు అగ్ని ఆహుతి అయ్యాయని రైతు తెలిపాడు.



పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 6: కరీంనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి నుంచి నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 5.32 లక్షల రూపాయలు పట్టుకున్నట్లు కరీంనగర్ మూడో థాణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. నగరంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళుతున్న డబ్బులను వేర్వేరు చోట్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుభాష్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తీగలగుట్టపల్లికి చెందిన ఒడ్నాల రవీందర్ వద్ద 3.32 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వావిలాలపల్లి ట్రినిటీ గర్ల్స్ జూనియర్ కళాశాల వద్ద వాహనాల తనిఖీల్లో గౌతమి నగర్‌కు చెందిన పింగిళి విష్ణువర్ధన్‌రెడ్డి వద్ద నుంచి రెండు లక్షల రూపాయ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారివద్ద తగి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని తెలిపారు.

● సైదాపూర్: మండలంలోని ఎలబోతారం గ్రామంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో 1.2 లక్షల నగదు పట్టుకు న్నట్లు ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేకుండా 1.2 లక్షల నగదు తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ నగదును సీజ్ చేశామన్నారు.

● జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పలువురి వద్ద నుంచి ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న ఐదు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల ప్రాంతానికి తరలిస్తున్న టీవీలు, ఫ్రిజ్‌లను సీజ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో సీఐ వేణు గోపాల్. ఎస్సైలు నరేష్, మన్మధరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎండపల్లి, మే6: బతుకుదెరువు కోసం వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం.. ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన దోనిపెల్లి హరికృష్ణ (28) అలియాస్ మనోజ్ కుమార్ జయశంకర్ జిల్లా మల్హర్ మండలం రుద్రారం గ్రామంలోని మెగా కంపెనీలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. పని వద్ద ఉదయం ట్రాక్టర్‌తో వ్యవసాయ బావి వద్దకు నీరు తీసుకురావడానికి వెళ్లాడు. నీరు పడుతుండగా నీటి ట్యాంకర్ ఎంత వరకు నిండిందో చూద్దామని ట్యాంకర్ పైకి ఎక్కాడు. కరెంట్ తీగ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని పోస్టుమార్టమ్ కోసం జయశంకర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి మరణ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి

బోయినపల్లి, మే 6: నీటిలో మునిగి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన చిత్తరి పుల్లయ్య (20) అతని తల్లి, చెల్లితో సహా వేములవాడలో నివాసముంటున్నారు. కాగా పుల్లయ్య గత 6 నెలల నుంచి బోయినిపల్లి మండలం కొదురుపాకలోని కల్లెం రాజయ్య దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం గొర్రెలను తోలుకుని మేపడానికి మిడ్ మానేర్ బ్యాక్ వాటర్ వైపు వెళ్లి అక్కడే ఈత నేర్చుకుంటున్నాడు. ఎప్పటిలాగే సాయిలు అనే మరో గొర్రెల కాపరితో కలిసి మిడ్ మానేర్ వైపు వెళ్లి ఈత కొడుతూ స్నానం చేయడానికి నీళ్లలోకి దిగాడు. అక్కడే పూడిక ఉండటంతో అందులో కురుకుపోయాడు. మృతుడు పుల్లయ్య ఎంతకు రాకపోవడంతో పైన ఉన్న సాయిలు గ్రామంలోకి వెళ్లి కొందరు గ్రామస్తులను తీసుకువచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వాటర్ గుంతలో గాలించి పుల్లయ్య మృతదేహం బయటకు తీసి పోస్టుమార్టం కు పంపించారు. మృతుని తల్లి వజ్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- పోలీసులకు చిక్కిన దొంగలు

కోరుట్ల మే 6: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఏటీఎంలో ఆదివారం రాత్రి చోరీకి యత్నించారు. అదే సమయంలో మొబైల్ పార్టీ పోలీసు గమనించి దొంగలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మెదట పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాతంలో ఉన్న శ్రీలక్ష్మి వైన్స్ వద్ద ఉన్న సీసీ పుటేజీలను ధ్వంసం చేసి వైన్స్ షెటర్లకు ఉన్న తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేయగా అవి రాక పోవడంతో అక్కడే ఉన్న ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఏటీఎంలో సీసీ పుటేజీ ధ్వంసం చేసి మిషన్ పూర్తిగా ధ్వంసం చేసి దానిలో ఉన్న డబ్బులను తీసే ప్రయత్నం చేసారు. అదే సమయంలో మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి నేషనల్ హైవేపై పెట్రోలింగ్ చేస్తున్నాడు. ఎస్సై ఆ ప్రాంతానికి రావడంతో ఏటీయం వద్ద ఇద్దరు వ్యక్తులు కనపడడంతో అక్కడి వెళ్లి పరిశీలించాడు. ఏటీయం మిషన్ ధ్వసంమై చోరీకి యత్నించినట్లు గుర్తించారు. ఏటీయంలో ఉన్న వారు పారిపోవడానికి ప్రయత్నం చేయగా వారిని పట్టుకోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా వారు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. పట్టణంలో మామిడి కాయ దుకాణంలో కూలి పని చేయడానికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మద్యం మత్తులో ఉండి దొంగతనాలు పాల్పడుతుంటారని పోలీసు తెలిపారు. ఏటీఎం అధికారి శ్రీనివాస్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కోరుట్ల ఎస్ఐ కిరణ్ తెలిపారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 15మంది రైతులు 159క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ట ధర రూ.7 వేలు, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

డాక్టర్లు, సిబ్బందిపై దాడులు సరికాదు

సుభాష్‌నగర్, మే 6: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటి దాడులు సరికాదని ఉమ్మడి జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు అన్నారు. డాక్టర్ ప్రతి రోగిని బతికించాలనే ప్రయత్నిస్తాడని, అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాడని అన్నారు. అయితే దురదృష్టవశాత్తు రోగి మరణిస్తే దానికి డాక్టర్‌ను బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. రోగి బంధువులు విచక్షణ కోల్పోయి డాక్టర్, సిబ్బందిపై డీజిల్‌తో హత్యాయత్నం చేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. ఆసుపత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి భయానకం సృష్టించడం హేయమైన చర్య అన్నారు. బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు.

● దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

కోరుట్లలో ప్రభుత్వ వైద్యుడు, సిబ్బందిపై దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ జి వెంకట్‌రెడ్డి, తానా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మహేశ్, కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, సీనియర్ వైద్యులు డాక్టర్ బిఎస్ రావు, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ కిషన్, డాక్టర్ అలీం, డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. ఈ దాడి అమానుష చర్యగా ఆయన పేర్కొన్నారు. హత్యాయత్నం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ధ్వంసం చేసిన ప్రభుత్వ ఆస్తులను వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ

● అడ్డు వచ్చిన వ్యక్తికి గాయాలు

ముత్తారం మే 6: ముత్తారం మండల కేంద్రంలోని నాగులమ్మ వైన్ షాపులో మద్యం సేవించి మద్యం మత్తులో రెండు వందల కోసం గ్రామానికి చెందిన మారం మల్లారెడ్డి, పింగిలి ప్రభాకర్ రెడ్డి అనే ఇద్దరు గొడవ పడ్డారు. గొడవ తీవ్రతరమై బీరు సీసాలు పగలగొట్టుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా కేషనపల్లి గ్రామానికి చెందిన ఎండి షరీఫ్ వారిని ఆపే ప్రయత్నం చేయగా సీసా షరీఫ్ మెడలో గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో ఉన్న అతనిని చూసి స్థానికులు 108కు ఫోన్ చేసి పెద్దపల్లికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఉన్నత వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు

● ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

వేములవాడ, మే 6: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ పర్యటన సందర్భంగా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి ప్రధానమంత్రి కార్యక్రమం సందర్భంగా బందోబస్తు నిర్వహణపై బ్రీఫింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన సందర్భంగా 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను పూర్తి అప్రమత్తతో, ఐడి కార్డులను తప్పనిసరిగా ధరిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. హెలికాప్టర్ వద్ద విధులు నిర్వహించేవారు. అలర్ట్‌గా ఉండాలని, హెలికాప్టర్ వద్దకు ఎవరినీ రానివ్వకూడదని సూచించారు. ప్రతి అధికారి బందోబస్తు తనకు కేటాయించిన ప్రాంతంతో పాటు తాను నిర్వర్తించాల్సిన బాధ్యత గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్యూటీ ప్రదేశం నుంచి ఎవరు కూడా ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్లకూడదని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, చంద్రశేఖర్ రెడ్డి, వివిధ జిల్లాల నుండి వచ్చిన డీఎస్పీలు, సి.ఐలు ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం ఉనికికే ప్రమాదం తెస్తున్న బీజేపీ

● రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్రలు పన్నుతున్న బీజేపీ ● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ

కరీంనగర్, మే 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం ఉనికికే ప్రమాదం ఏర్పడనుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని హోదాలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తి ఆ రాజ్యాంగంపై ప్రమాణం చేసి దాని ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. విదేశాల్లో స్విస్ బ్యాంకు నల్లధనం తిరిగి తెప్పిస్తామని, 15 లక్షల ఖాతాలో జమ చేస్తామని చెప్పిన మోదీ హామీ ఏమైందన్నారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో 29 మంది గుజరాతీలు వేల కోట్లు ఎగవేశారన్నారు. మోదీకి భార్యపిల్లలు లేరని ఎగ్గొట్టిన వారే దత్తపుత్రులన్నారు. 11 వేల కోట్లు తీసుకున్న నీరవ్‌మోదీ ఎలక్టోరల్ బాండ్లకు 30 శాతం కట్టారన్నారు. మోదీ మిత్రుడైన అదానీ గంజాయి స్మగ్లర్ అని వీరిద్దరూ ఒకేసారి పైకి వచ్చారన్నారు. బీజేపీయేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో పార్టీలను చీల్చి, ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతున్నదని నారాయణ ఆరోపించారు. రాష్ట్రంలో సైతం బీజేపీతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రమాదముందన్నారు. మహారాష్ట్రలో చేసిన విధంగా పార్టీల్లో చిచ్చులు పెట్టి ప్రభుత్వాలు కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీజేపీ తప్ప ఏపార్టీ మనుగడ సాగించ వద్దనే ఆలోచనతో మోదీ ఉన్నారన్నారు. అయోధ్య రామ మందిరాన్ని ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ఆదరాబాదరగా ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రారంభించారన్నారని అది అపశకునంగా మారిందన్నారు. దేశంలో రెండో విడత ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. ఇండియా కూటమి వస్తే ముస్లింలు దాడులు చేస్తారని ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రశ్నించే వారిని సీబీఐ, ఈడీల పేరుతో వేధిస్తున్నారన్నారని, ఢిల్లీ ముఖ్యమంత్రిని జైలు పాలు చేశారన్నారు. మోదీకి వత్తాసు పలికినందుకు పది సంవత్సరాలుగా జగన్ మాత్రం బెయిల్‌పైనే ఉన్నాడన్నారు. ప్రస్తుతం బీజేపీయేతర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డిపై వేధింపులు మొదలయ్యాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపీలు ఎన్నికవుతున్నారని, పార్లమెంట్ పరిధిలో పది లక్షలకు పైగా ఉన్న ఓటర్ల అభిప్రాయాలకు విలువ లేకుండా పోతోందన్నారు. 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు పన్నుతున్నారని నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి, అహంభావంతో ఓడిపోయిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి అడ్డుకట్ట వేసేందుకే ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా చేరామని, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ శ్రేణులు పనిచేస్తాయని నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, కలవేన శంకర్, ఉమ్మడి జిల్లా సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

'కేడీసీసీబీ దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకు'

కరీంనగర్ టౌన్, మే 6: సహకార అభివృద్ధి నిధుల వినియోగంలో దేశంలోనే అత్యుత్తమ సహకార బ్యాంకుగా ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ నిలిచిందని నాబార్డు రిటైర్డు చీఫ్ జనరల్ మేనేజర్ డి.రవీంద్ర అభినందించారు. సోమవారం ఆయన సీడీఎఫ్ నిధులు వినియోగంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మురళీధర్‌తో కలిసి నగరంలోని డీసీసీబీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ డిసిసిబి సక్సెస్ ఫార్ములాను దేశంలోని అన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి కేంద్రం, సిడిఎఫ్ వినియోగంపై అధ్యయనం చేసేందుకు నాబార్డు కమిటీని ఏర్పాటు చేసిందని అన్నారు. టెస్కాబ్ ఎండి మురళీధర్ మాట్లాడుతూదేశంలోనే కేడీసీసీబీ నాలుగు విభాగాల్లో వరుసగా నాఫ్‌స్కాబ్ జాతీయ అవార్డులను కైవసం చేసుకున్నామని తెలిపారు. అన్ని ప్రాథమిక సంఘాలను కంప్యూటరీకరణ చేసిన తొలి సహకార కేంద్ర బ్యాంకు కరీంనగర్‌లేదనని గుర్తు చేశారు. పిడిసి రిసోర్సు పర్సన్ జి. సత్యనారాయణ కేడీసీసీబీ సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బ్యాంకు సీఈవో ఎన్.సత్యనారాయణరావు, నాబార్డు డిడిఎం జయప్రకాశ్, మనోహర్‌రెడ్డి, దిలీప్, జనరల్ మేనేజర్లు పి.ప్రభాకర్‌రెడ్డి, ఉషశ్రీ, డిజిఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్

రాయికల్, మే 6: డీజిల్ ఫిల్లింగ్ చేసుకోవడానికి వచ్చిన ఓ ట్రాక్టర్‌లో పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన సంఘటన రాయికల్ పట్టణంలోని జగిత్యాల రోడ్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో చోటు చేసుకుంది. బాధిత ట్రాక్టర్ యాజమాని కుర్మ మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తన ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ ఫిల్లింగ్ చేసిన విషయం తనకు తెలియదన్నారు. ఫిల్లింగ్ చేసిన పెట్రోల్‌ను బంక్ సిబ్బంది తొలగించే క్రమంలో సమాచారం రావడంతో బంక్ వద్దకు వెళ్లి చూడగా తన ట్రాక్టర్ నుంచి పెట్రోల్ తొలగించి, స్థానిక ట్రాక్టర్ షో రూం మెకానిక్‌తో రిపేర్ చేయడానికి బంక్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. సుమారు 2 గంటల పాటు ట్రాక్టర్ యాజమాని ఆందోళన చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది ఇరువురికి సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ యాజమాని సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన బంక్ సిబ్బంది తీరుపై విచారణ జరిపి బంక్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పెట్రోల్ బంక్ సిబ్బందిని వివరణ కోరగా తాము డీజిల్‌కు బదులు పొరపాటున పెట్రోల్ ఫిల్లింగ్ చేసన విషయం వాస్తవమేనని అంగీకరించారు.

కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హత లేదు

● టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

కరీంనగర్ అర్బన్, మే6: తెలంగాణ ఉద్యమపార్టీ, రాజకీయపార్టీ అంటూ తెలంగాణ పదాన్ని బొందపెట్టి బీఆర్ఎస్‌గా మార్చుకున్న కేసీఆర్‌కు తెలంగాణ పదం ఉచ్చరించే అర్హతలేదని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ అధికారప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. డీసీసీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, కవులు, విద్యార్థుల ఉద్యమాలతో 1200మంది ఆత్మ బలిదానాలతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేసీఆర్ అవినీతి పాలనకు కేంద్ర బిందువు అయిందన్నారు. గ్రానైట్, ఇసుక మాఫియాలతో గుట్టలు, వాగులు, నదుల ఆనవాళ్లు లేకుండా చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక అవసరాలకే ట్రాక్టర్లతో మాత్రమే ఇసుక తీసుకువెళ్లే అవకాశం కల్పించామని మృత్యుంజయం తెలిపారు. కాంగ్రెస్‌కు 8, బీజేపీకి 8, ఎంఐఎంకు ఒక సీటు పంచుకున్నారని హరీశ్‌రావు వాఖ్యలతో బీఆర్ఎస్ పార్టీకి ఏమి సీట్లు రావని చెప్పకనే చెప్పాడన్నారు. కరీంనగర్‌లో తీగల వంతెన, రివర్‌ఫ్రంట్‌లు కట్టమని ఎవరూ అడగలేదని, ఆ నాయకులు, కాంట్రాక్టర్ల కోసమే నిర్మించారని, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అవినీతి పాపాలు నేడు ఈ రాష్ట్రానికి శాపాలుగా మారాయన్నారు. కరీంనగర్‌లోని ఒక రైస్‌మిల్‌లో 600 కోట్ల విలువైన వరిధాన్యం ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా అక్కడే పెట్టారని, ఇంతటి అవినీతి జరుగుతున్నా పౌరసరఫరాల శాఖకు తెలియకుండా ఉందనేది విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నారన్నారు. ముస్లింల రిజర్వేషన్లు ఎందుకు రద్దు చేయాలని ఆయన ప్రశ్నించారు. మోదీతో చీకటి ఒప్పందం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించ కుండా, కేసీఆర్‌ను జైలుకు పంపించలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 13 నుంచి 14 సీట్ల వరకు వస్తాయని, బీజేపీకికి మూడు లేదా నాలుగు సీట్లు రావ చ్చని, ఎంఐఎంకు ఒక సీటు వస్తుందని, బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం

రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర

● ఈనెల 8న రాజ్యాంగ రక్షణ సభ ● పజా సంఘాల జేఏసీ రాష్ట అధ్యక్షుడు గజ్జల కాంతం

సుభాష్‌నగర్, మే6: ఆర్ఎస్ఎస్ మార్గదర్శనంలో రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దుకు బీజేపీ పూనుకోనున్నదని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల కాంతం ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు గెలుపొందడం ద్వారా సులువుగా రాజ్యాంగాన్ని రద్దు పరచవచ్చన్న అంగీకారానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు వచ్చాయన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్దేశించిన రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. దేశ సంపదను అదాని, అంబానీలకు ధారా దత్తం చేశారని విమర్శించారు. రైతులపై నల్ల చట్టాలను తీసుకువచ్చి 750 మంది రైతుల చావులకు కారకులయ్యారని ఆరోపించారు.

● రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు యోచనను వ్యతిరేకిస్తూ బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో రాజ్యాంగ రక్షణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజ్యాం గం, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంయుక్తంగా చేసిన తీర్మాన ప్రతులు తమ వద్ద ఉన్నాయని, రాజ్యాంగ పరిరక్షణ సభలో బహిర్గతం చేస్తామన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్ల రద్దుకు బీఆర్ఎస్ కూడా మద్దతు ఇస్తుందని, అందువల్లనే ఆ పార్టీ అధినేత కేసీఆర్ నోరు మెదపడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో సముద్రాల అజయ్, గజ్జల ఆనందరావు, కోంద్ర స్వరూప, సుద్దాల లక్ష్మన్, గోష్కి శంకర్, కల్లెపల్లి శంకర్, ఆవారు లత, భారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జల కాంతం

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్


కరీంనగర్ క్రైం, మే 6: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన ఒక అవివాహిత(39)ని అదే గ్రామానికి చెందిన గువ్వల సత్యం(44) ఏడాదిగా ఆమె ఫోన్‌కు కాల్ చేసి మాట్లాడుతూ వేధిస్తుండేవాడు. గత జులై నెలలో ఆమె ఇంటికి వెళ్లి అత్యాచారం చేశాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. వీడియోలు తీశానని బ్లాక్‌మెయిల్ చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నేరస్తుడిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్శేడ్‌కు చెందిన నేరెళ్ల సంపత్‌కుమార్(43) ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సంపత్‌కుమార్ చేగుర్తిలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని, ఆదివారం ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇరుకుల్ల వద్ద ద్విచక్రవాహనాన్ని యూటర్న్ చేస్తుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తీగలవంతెన పైనుంచి దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మే 6 : కరీంనగర్ శివారులోని బైపాస్‌రోడ్ వద్ద తీగల వంతెనపై నుంచి కిందకు దూకి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో ఒక వ్యక్తి తీగల వంతెనపై నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని, అతని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉందని, ఎడమ కన్ను బొమ్మపై భాగంలో గాయానికి సంబంధించి ఏడు కుట్లు వేయబడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాకు వివరాలు తెలుపాలని పోలీసులు కోరారు. మృతుడి వివరాల కోసం ఫోన్: 8712670764, పోలీసు ఠాణా 8331940590లో సంప్రదించాలని కోరారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మార్చరీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాలపై ఎన్నికల కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మే 6 : ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త అయిన ఆకుల ప్రకాష్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్ రెడ్డి తెలిపారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా, సంబంధిత అధికారి నుంచి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా ఆదివారం ఉదయం హౌసింగ్ బోర్డ్‌కాలనీ లైబ్రరీ ఆవరణలో కొంతమంది ప్రజలను సమావేశపరిచి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించి, ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇంచార్జి, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బీ రమణారెడ్డి ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో పాటు, సభ ఏర్పాటు చేసినందుకు ఆకుల ప్రకాష్‌లపై ఎన్నికల నియామావళి ఉల్లంఘన కేసు నమోదు చేసామన్నారు.

వ్యవసాయ పొలాల్లో అగ్ని ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, మే 6: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, తిమ్మాపూర్, హరిదాస్‌నగర్ గ్రామ శివారుల్లోని వ్యవసాయ పొలాల్లో సోమవారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. పొలాల చుట్టూ మంటలు వ్యాపించాయి. ఆయా గ్రామాల్లోని రైతులకు చెందిన పశుగ్రాసం, విద్యుత్తు మోటార్లు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిబూడిదయ్యాయి. రైతులు చేరుకుని మంటలను అదుపు చేయడంతో చుట్టు పక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. తమను ఆదుకోవాలని కోరారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్ధమైంది. బాధిత రైతు వెంకట్‌రెడ్డి మాట్లడుతూ నాలుగు ఎకరాలలో పశుగ్రాసం కట్టలు కట్టి ఉంచామన్నారు. సోమవారం విద్యుత్తు తీగలు తగిలి మంటలు చెలరేగి గడ్డి కాలి బుడిదయ్యిందని తెలిపాడు. గతంలో సైతం గడ్డి కాలి పోయిందని వైర్లను సరిచేయాలని సెస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు



తిమ్మాపూర్‌లో కాలిపోయిన పశుగ్రాసం

ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలి

● ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్ ఆకునూరి మురళి

జమ్మికుంట రూరల్, మే 6: ప్రభుత్వాలు నాణ్యమైన విద్య వైద్యం అందించాలని జాగో తెలంగాణ ఓటర్ల చైతన్య యాత్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. జాగో తెలంగాణ ఆద్వర్యంలో చేపట్టిన ఓటర్ల చైతన్య యాత్ర సోమవారం జమ్మికుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల సంక్షేమం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ఇవి తప్ప బీజేపి ప్రభుత్వం అన్ని చేస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, మోదీ ఇచ్చిన ఉద్యోగాలు కరీంనగర్‌లో ఎక్కడైనా కనిపించాయా చెప్పాలన్నారు. నల్ల చట్టాలు తీసుకు వచ్చి వందల మంది రైతుల ప్రాణాలు బలిగొన్నారని గుర్తు చేశారు. పదేళ్లు పాలించి ప్రజలను మోసగించిన బీఆర్ఎస్ పార్టీని తరిమి కొట్టారని, అదేవిధంగా ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

ఎండ తీవ్రత తట్టుకోలేక మహిళ మృతి

శంకరపట్నం, మే 6: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఎండ తీవ్రత తట్టుకోలేక అస్వస్థతకు గురై ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేశవపట్నం గ్రామానికి చెందిన పంజాల భారతి (55) సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు.

బీ ఫార్మసీ, బీపీఎడ్ పరీక్ష ఫలితాలు విడుదల

గనేశ్‌నగర్, మే6: ఎస్‌యూ పరిధిలోని బీ ఫార్మసీ మొదటి, రెండు, ఏడు, ఎనిమిదో సెమిస్టర్, బీపీఎడ్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

జీవన్ రెడ్డిని భారీ మోజారిటీతో గెలిపించాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

కోరుట్ల మే 6 : నిజామాబాదు ఎంపీగా జీవన్ రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జువ్వాడి భవనలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కలిసి మాట్లాడారు. మోది ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం కొనసాగలంటే బీజేపీని చిత్తుగా ఓడించాలని అన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేసామని చెపుతున్న బీజేపీ పార్లమెంట్ ఉబయ సభలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడే అవకాశం ఇవ్వని ప్రభుత్వ నరేంద్ర మోది ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోదీ సర్కార్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు

రాయికల్, మే 6: మరోసారి మోదీ సర్కార్ ఏర్పాటుతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోగ శ్రావణి, పడాల తిరుపతిలు అన్నారు. రాయికల్ మండలంలోని సింగరావుపేట, అయోధ్య, రాజ్‌నగర్ గ్రామాల్లో సోమవారం నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం ఎండగడుతూ బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను అత్యధిక మెజార్టీతో పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, మండల ఉపాధ్యక్షుడు పశుపునూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఏనుగు రవి, బూత్ అధ్యక్షుడు ధర్మరాజు, జితేందర్, పుప్పాల రాజిరెడ్డి, తాళ్లపల్లి శ్రీరామ్, కంచర్ల అంజన్న, జలపతి, రాజు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఇంటిపన్ను సకాలంలో చెల్లించాలి

మెట్‌పల్లి, మే 6: ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపాల్ కమిషనర్ మోహన్ అన్నారు. పట్టణంలోని ఇంటి బిల్లులు కార్డుపే చెల్లింపులను స్వీకరించడానికి సోమవారం ఆక్సిస్ బ్యాంక్ వారు అందించిన హ్యాండ్ హెల్డ్ మిషన్లను బిల్లు కలెక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఇంటి యజమానులు ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించేందుకు కార్డు ద్వారా, యూపీఐ పేమెంట్స్, క్యాష్, క్యూఆర్ ద్వారా చెల్లింపులు జరపడానికి వెసులు బాటు కల్పించడానికి హ్యాండ్ హెల్డ్ మిషన్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో అధికారులు రాజ్యలక్ష్మి, ఉమ, అక్షయ్, ప్రసాద్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

'సర్కారు బడులను సద్వినియోగం చేసుకోవాలి'

కథలాపూర్, మే 6: ప్రభుత్వ బడులను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని ఎంఈఓ ఆనందరావు కోరారు. సోమవారం మండలంలోని తాండ్ర్యాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాంతో పాటు మధ్యాహ్న భోజనం వంటి వసతులు కల్పిస్తోందన్నారు. వంద శాతం ఫలితాలు సాధించిన కర పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. బడిబాటలో 25 మంది కొత్తగా విద్యార్థులను బడిలో చేర్పించుకున్నామని హెడ్‌మాస్టర్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కిషన్‌రావు, హెచ్ఎంలు సాయికృష్ణ, రవి, శశాంక్, విజయ్, కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

గండిహనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, మే 6: మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలో హుండీ లెక్కింపును నిర్వహించినట్లు కార్యనిర్వహణాధికారి విక్రమ్‌గౌడ్ సోమవారం తెలిపారు. ఉదయం ఆలయంలోని స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం హుండీ లెక్కింపు చేపట్టారు. హనుమాన్ జయంతి జరిగిన అనంతరం ప్రతి సంవత్సరం హుండీ లెక్కింపులను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆలయానికి ఆదాయం రూ. 1,62,622ల నగదు వచ్చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో దేవాలయ జిల్లా ఇన్స్‌పెక్టర్ రవికిషన్, సిబ్బంది రేండ్ల గంగాధర్, గంగాధర్, ఆలయం కమిటీ నిర్వహకులు రామనుజం, మనోజ్, మల్లేశం, శంకర్, శేఖర్‌రెడ్డి, వేణు, ప్రతాప్‌రెడ్డి, పురోహితులు మాధవాచారి, సిబ్బంది పాల్గొన్నారు.


వడదెబ్బ.. జర జాగ్రత్త

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

● జగిత్యాల రూరల్ మండలం దరూర్ గ్రామానికి చెందిన రాయపోశు అనే వృద్ధుడు ఇటీవల పని నిమిత్తం బయటకు వెళ్లి వచ్చాడు. కాసేపటికి వడ దెబ్బ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు.

● బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామంలోని గోండు గూడానికి చెందిన కొమురం సోము అనే రైతు ఇటీవల నువ్వు పంట కోసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. కాసేపటికి మంచంలోనే మృతి చెందాడు. ఇలా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎండ వేడిమి వల్ల పలువురు అస్వస్థతకు గురి కావడం, మరికొందరు ప్రాణాలు కోల్పోతుండడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 40 నుంచి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రోజురోజుకూ ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు, రోగ నిరోధక శక్తి తగిన మోతాదులో లేని అనారోగ్య తీవ్రత ఉన్న వారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నాయి. జిల్లాలో వారం రోజులుగా ఎండ వేడిమి తీవ్రత ఎక్కువయింది. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వడ దెబ్బకు గురయ్యే కారణాలు, వడ దెబ్బ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ముందస్తు జాగ్రత్తలను జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి, జగిత్యాల



వడ దెబ్బ లక్షణాలు..

శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శీరరం అదుపు తప్పుతుంది. నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కాళ్ల లాగుతాయి. తలనొప్పి వస్తుంది. శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఏర్పడుతాయి. దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు...

వడదెబ్బకు గురైనప్పుడు శరీరాన్ని వేగంగా చల్లబరిచే ప్రయత్నం చేయాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని ప్రదేశంలోకి తీసుక వెళ్లాలి. చల్లని నీళ్ల చల్లడం, ఫ్యాను గాలి తగలనీయాలి, దుస్తులను వదులుగా చేసి తడి గుడ్డతో ఒళ్లంతా తుడ వాలి. రోగికి తగినంత గాలి ఆడేటట్లు చేయాలి. వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్ల కూడదు. విశ్రాంతి తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లడం ఉత్తమం. రోజుకు ఐదు ఆరు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. ఉప్పు కలిపిన ద్రవాలు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగాలి. శీతల పానీయాలకు బదులుగా కొబ్బరి బోండాం, మజ్జిగ తాగడం చాలా వరకు మంచింది.

ఈ చిట్కాలు పాటిస్తే వడదెబ్బ నుంచి సురక్షితం...

వేసవిలో కీర దోస ముక్కల్ని ఎక్కువగా తినాలి. దీనివల్ల శరీరానికి నీటితో పాటు పోషకాలు అందుతాయి. మలబద్ధక సమస్య కూడా తగ్గుతుంది. శరీరంలో నీటి శాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరి నీళ్ల తాగాలి. జీలకర్ర దోరగా వేయించి పొడి చేసి, అరస్పూన్ పొడిని గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే ఎనర్జీ వస్తుంది. సలాడ్స్, తాజా కాయ గూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవడం మంచింది.

సమ్మర్ హెల్త్ కేర్...

ఈ సారి ఏప్రిల్‌లోనే ఉష్ణోగ్రత రికార్డు స్థాయికి పెరిగింది. మేలో ఎండ తీవ్రత మరింతగా పెరిగింది. వేసవితాపంతో జనం అల్లాడుతున్నారు. విపరీతమైన ఎండవేడి తీవ్రమైన అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది. ముఖ్యంగా వేసవిలో ఎండదెబ్బ విషయంలో చాలా జాగ్రత్త వహించాలి. హీట్ స్ట్రోక్‌కు తక్షణ వైద్య సహాయం అవసరం. వడదెబ్బ తగిలినపుడు చికిత్స కోసం ఎక్కువసేపు వేచి ఉంటే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని అంటున్నారు. ఎందుకంటే ఇది మెదడు, గుండె, మూత్రపిండాలు, కండరాలను వేగంగా దెబ్బ తీస్తుంది. కాబట్టి చికిత్సలను అందించేలోపు ఎండదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లబరచడానికి తక్షణ ప్రయత్నాలు చేయండని సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



జిల్లాలో ప్రస్తుత వేసవిలో ఎండలు విపరీతంగా ఉంటున్నాయి. ఉష్ణోగ్రత రోజురోజుకు పెరుగు తోంది. ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దు. వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని వైద్యుని వద్దకు తీసుకవెళ్లి చికిత్స అందించాలి.

వైద్య సిబ్బంది సిద్ధం :

డాక్టర్ పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్యాధికారి



జిల్లాలోని ప్రతి సబ్ సెంటర్‌లలో, ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలతో పాటు పల్లె దవఖానాలు, బస్తీ దవఖానాలు, వైద్య కేంద్రంలో ప్రతినిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. అన్ని సౌకర్యాలు ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేశాము. వడదెబ్బ తగిలిన వారిని గుర్తించిన వారు వెంటనే 108కు సమాచారం అందించాలి. అంగన్‌వాడి కేంద్రాలలో, ఉపాధి హామీ పనిచేసే ప్రాంతాల్లో కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాము. అవసరమున్న వారు సంబంధిత సమీప కేంద్రాలలో ఉచితంగా పొందవచ్చును.

కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వం

గల్ఫ్ కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

భీమారం, మే 6: కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండలంలోని మోత్కురావుపేట, రాజలింగంపేట, పసునూరు, గోవిందారం, దేశాయిపేట, ఈదుల లింగంపేట, మన్నెగూడెం, కమ్మరిపేట, వెంకట్రావుపేట, రాగోజీపేట, ఒడ్యాడ్ గ్రామాల్లో సోమవారం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంట్‌కు జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం కనిపిస్తోందని, దేశంలో రెండు విడతల్లో ఎన్నికలు పూర్తయినా కాంగ్రెస్ పార్టీకి అనుకూల వాతావరణం ఉందన్నారు. గల్ఫ్ కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, గల్ఫ్‌లో మరణించినవారికి ఇటీవల రూ.5 లక్షలు వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. గల్ఫ్ సంఘాల నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారని, గల్ఫ్‌లో మరణించిన వారిని ప్రభుత్వం తరఫున ఆదుకోవడంతో పాటు కేరళ తరహాలో గల్ఫ్ పాలసీని తీసుకువస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బండి సంజయ్ మోత్కురావుపేట రోడ్డు కోసం ఏనాడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మోత్కురావుపేట రోడ్డు వేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తాత్కాలిక రోడ్డు వేశామని, మరింత మెరుగుపరుస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో వారి కుటుంబసభ్యులు మాత్రమే బాగుపడ్డారన్నారు. ఆగస్టు 15లోగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. మోదీ దేశ సంపద మొత్తం నలుగురి చేతుల్లో పెట్టాడని, దేశంలో పేద ప్రజల కష్టాలు తెలుసుకోవడం కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుల గణన చేపడుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం పని దినాలను పెంచుతూ, కూలీ రూ.400 వరకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మోత్కురావుపేట మాజీ ఉప సర్పంచ్, బీజేపీ నాయకుడు కుక్కదోవ గంగారాం, మేడిపల్లి మండల బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు క్యాతం సుమలత, భీమారం బీఆర్ఎస్ నాయకుడు పెద్దిరెడ్డిస్వామి రెడ్డిలు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రానున్న ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

అన్ని వర్గాల అభివృద్ధి కోసమే ఆరు గ్యారెంటీలు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మెట్‌పల్లి, మే, 6: రాష్ట్రంలోని అన్ని వర్గాలను ఆదుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందని పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన పంబాల, దేవతా పోతురాజులు, బైండ్ల, కోలుపులు, అసాది ఐక్య సంఘం ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా వారు హాజరయ్యారు. గ్రామ దేవతల పూజారుల సమస్యలు, కమ్యూనిటీ హాలు, ఆలయం వేతనం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవతల పూజలు చేసే వారిని పూజారులుగా గుర్తించి, దీప దూప నైవేద్యం పథకం కింద ఆలయ వేతనం, జిల్లాలలో కమ్యూనిటీ హాలు మంజూరు చేయిస్తామని, ఉప కులాలలోని కొందరికి ఎస్సీ సర్టిఫికెట్‌లు ఇవ్వడంతో పాటు మిగితా కులాల సమస్యలను ఎన్నికల తరువాత సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి లోక్‌సభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, కల్వకుంట్ల సుజిత్‌రావు, కొమిరెడ్డి కరంచంద్, కొమిరెడ్డి విజయ్‌అజాద్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జెట్టి లింగం, దేవతల పూజారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగా గంగాధర్, జంగా స్వామి, గౌరీ లక్ష్మణ్, శివనందం, సతీష్, భవాని, బద్దం గంగాధర్, ఉపేందర్, అంబాలి గంగాధర్, జలంధర్, పురుషోత్తం, నవీన్, ప్రకాశ్, మురళి, లక్ష్మినారాయణ, మనోహర్, షాకీర్, జెట్టి లక్ష్మణ్, కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్‌కు ప్రధాని అభ్యర్థే లేడు

- కరీంనగర్‌లో ఆ పార్టీది మూడో స్థానం
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

జమ్మికుంట, మే 6: కాంగ్రెస్‌కు ప్రధాని అభ్యర్థే లేరని, అలాంటి పార్టీకి ఓటు ఎలా వేస్తారని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం జమ్మికుంటలో నిర్వహించిన బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తాము పువ్వు గుర్తుకు ఓటు వేయాలని తిరుగుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం గాడిద గుడ్డు గుర్తు పట్టుకుని తిరుగుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయాలనుకునే వాళ్ల బ్యాలెట్‌లో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే ఓటు వేయాలన్నారు.. కరీంనగర్‌లో ఆ పార్టీ మూడో స్థానంలో ఉందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలను మోసగించిందన్నారు. ధరల పెరుగుదల గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం బాధాకరంగా ఉందన్నారు. యూపీఏ హాయంలో రూ.12లక్షల కోట్ల స్కాంలకు పాల్పడిన ఘణత కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. కరీంనగర్‌లో బీజేపి గెలువాలి, దేశంలో మళ్లీ మోది ప్రధాని కావాలన్నారు.

హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా మార్చేందుకు కుట్ర

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

వేములవాడ, మే 6 : హైదరాబాద్ నగరాన్ని ఉమ్మడి రాజధానిగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని కరీంనగర్ లోక్ సభ టీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. సోమవారం వేములవాడలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌ను మరో 10 ఏళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు బీజేపీ, తెలుగు దేశం, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయన్నారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని బీజేపీ యోచిస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి 500 కోట్లు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి కావాలా.. విధ్వంసం కావాలో ప్రజలే తేల్చుకోవాలని, అభివృద్ధి ఆకాంక్షగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ఆయన కోరారు.



వేములవాడలో మాట్లాడుతున్న వినోద్ కుమార్

సంక్షిప్త సమాచారం

ధర్మపురి: ధర్మపురి మండల (ఇన్‌చార్జి) విద్యాధికారి బత్తుల భూమయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు కొనియాడారు. సోమవారం ధర్మపురి మండల ఎంఆర్‌సీలో ఎంఈవో బత్తుల భూమయ్య సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు గజభీంకార్ గోవర్ధన్, గాదె శ్రీనివాస్, బండి మహేష్, కాశెట్టి రమేష్, శ్రీనివాస్, లక్ష్మి, హరిత, పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన మాజీ సర్పంచ్ పిడుగు లావణ్యతిరుపతిరెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో పనిచేసిన లావణ్య తిరు పతిరెడ్డి గత కొద్ది రోజుల కిందట పార్టీకి రాజీనామా చేశారు. అయితే సోమవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

●మండలంలోని అంబారిపేట తాజా మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం మాజీ స్పీకర్ సురేశ్ రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

●దేశ ప్రజలు మూడోసారి నరేంద్ర మోదీనే ప్రధాన మంత్రి కావాలని కోరుకుంటున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఇప్పపల్లిలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి పార్లమెంట్ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. వెంకటేశ్వర్‌రావు, అజయ్ ఉన్నారు.

●మండలంలోని చింతకుంట, తక్కళ్లపల్లి గ్రామాల్లో సోమవారం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటీ ప్రచారం నిర్వహించాయి. డీసీసీ మాజీ సభ్యులు చెదలు సత్యనారాయణ, తాజా మాజీ సర్పంచ్ బైర హేమలతమల్లేశ్, వేముల క్రిష్ణ ఉన్నారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లిలో బీజేపీ నాయకులు ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలపించాలని ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనుల వద్ద ప్రచారం నిర్వహించారు. మల్యాల మండల కేంద్రంలో సంజయ్ గెలుపు కోసం భారీ ర్యాలీ నిర్వహించారు.

●మండలంలోని మ్యాడంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనుల వద్ద కూలీలను కలిసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. మండల శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, రౌతు రవి, ఎదులాపురం భూపతి, అశోక్ ప్రచారం చేసిన వారిలో ఉన్నారు.

●కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ముత్యంపేటలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి మహిళలను ఓట్లు అభ్యర్థించారు. నాయకులు ఆదిరెడ్డి, శోభరాణీ, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

జగిత్యాల టౌన్: నిజామాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని 10వవార్డులో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

సారంగాపూర్ : సారంగాపూర్ నూతన ఎస్సైగా దత్తాద్రిని నియమిస్తూ ఎస్సీ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ధర్మపురి : కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి పై దాడికి నిరసనగా సోమవారం మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట డాక్టర్లు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిందుతులను వెంటనే అరెస్ట్ చేసి నాన్‌బెయిలబుల్ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డాక్టరు అవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండపల్లి: పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ని అధిక మెజారిటీతో గెలిపించాలని మండల అధ్యక్షులు సింహాచలం జగన్, గాజుల మల్లేశం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ప్రచారం చేశారు.

కొడిమ్యాల : కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం మండల కేంద్రంలో, మండలంలోని నల్లగొండ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు.

●కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం రాత్రి మండల బీజేపీ నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.

●కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు.